సాక్షి
ప్రకాశం
సోమవారం, 7, ఏప్రిల్, 2025



సిగ్నల్ తీగల కత్తిరింపు ఇంటి దొంగల పనేనా?

రైల్వే సిగ్నల్ తీగల కత్తిరింపు సంఘటనలో రైల్వే పోలీసులపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వరుస సంఘటనలతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- 8లో..



ఎన్నాళ్లీ నరకం.. ఉద్యోగం చేయలేం..

ఉద్యోగులతో ముండ్లమూరు ఎంపీడీఓ వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతోంది. ఉద్యోగులంతా అవస్థపడుతున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36/26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.



ఒంగోలు దిబ్బలరోడ్డులోని అనంత కోదండరామస్వామి ఆలయంలో కళ్యాణ వేదికపై కొలువుదీరిన సీతారామస్వాములు

కళ్యాణ వైభోగమే

శ్రీరామనవమి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా అన్నదానాలు చేసి పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

- సాక్షి, ఒంగోలు





సంతపేట సాయిబాబా మందిరంలో సీతారాముల కళ్యాణం జరిపిస్తున్న వేదపురోహితులు మరంపల్లి దక్షిణామూర్తి, పాల్గొన్న భక్తులు

న్యూస్‌రీల్

బౌద్ధ స్థూపాలకు పూర్వవైభవం తీసుకురావాలి



మాట్లాడుతున్న బౌద్ధ భిక్షువులు

చీమకుర్తి: రాష్ట్రంలోని బౌద్ధ స్థూపాలకు పూర్వవైభవం తీసుకురావాలని బౌద్ధ భిక్షువులు ఆకాంక్షించారు. జపాన్‌కు చెందిన బౌద్ధ భిక్షువు యూహీ, శ్రీలంకకు చెందిన బౌద్ధ భిక్షువు బోధిహీన్ ఆదివారం దొనకొండ మండలంలోని చందవరం బౌద్ధ స్థూపాన్ని సందర్శించి తిరిగి ఒంగోలు వెళ్తూ మార్గం మధ్యలో చీమకుర్తిలో ఆగి విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులతో, విలేకరులతో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 40 బౌద్ధ స్థూపాలున్నాయని, ఒక్కొక్క స్థూపం వద్ద ప్రతి పౌర్ణమి రోజు దీపోత్సవం చేస్తున్నామని చెప్పారు. అమలాపురం వద్ద ప్రభుత్వం రెండు లేదా మూడు ఎకరాల భూమి ఇస్తే బౌద్ధమత వ్యాప్తి కోసం శాంతి ప్రదేశం నిర్మించతలపెట్టినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు బౌద్ధ మతం గురించి వారు ఉపదేశించారు.

పండుగ పూట విషాదం

- నీటికుంటలో పడి బాలుడు మృతి



మృతిచెందిన తరుణ్


దొనకొండ: నీటికుంటలో పడి బాలుడు మృతి చెందడంతో పండుగ పూట విషాదం అలముకుంది. మండల కేంద్రమైన దొనకొండ పంచాయతీలోని గుట్టమీదపల్లి గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై టి.త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుట్టమీదపల్లి గ్రామానికి చెందిన పిక్కిలి వెంకటేశ్వరరావు గొర్రెలు మేపుకుంటూ జీవిస్తుంటాడు. శ్రీరామనవమి పండుగ, ఆదివారం సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో కుమారుడు పిక్కిలి తరుణ్ (13)ని తీసుకుని గొర్రెలు తోలుకుని పొలం వెళ్లాడు. నేను గొర్రెల దగ్గర ఉంటాను, నువ్వు వెళ్లి అన్నం తినిరా.. అని తండ్రికి కుమారుడు చెప్పగా, తండ్రి ఇంటికెళ్లి అన్నం తిని తిరిగి గొర్రెల వద్దకు వెళ్లాడు. అక్కడ కుమారుడు కనిపించలేదు. చుట్టుపక్కల గాలించగా, రైతులు పంటలు పండించుకోవడానికి ఏర్పాటు చేసుకున్న నీటి కుంటలో శవమై కనిపించడంతో వెంకటేశ్వరరావు నిర్ఘాంతపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై త్యాగరాజు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి బయటకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు. వెంకటేశ్వరరావుకు కుమారుడు, కుమార్తె సంతానం కాగా, కుమారుడు తరుణ్ స్థానిక విశ్వభారతి స్కూల్లో 6వ తరగతి చదువుతున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రాజ్యాధికారం ద్వారానే హక్కులు



మాట్లాడుతున్న విజయకుమార్

ఒంగోలు వన్‌టౌన్: దేశంలో మైనార్టీ వర్గాలకు రాజ్యాధికారం ద్వారా మాత్రమే వారి హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమవుతుందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ అన్నారు. ఆ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. 75 సంవత్సరాల రాజ్యాంగం అమలులో సవాళ్లు అనే అంశంపై ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. విజయకుమార్ పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగ హక్కుల అమలు, పరిరక్షణ బాధ్యత ప్రజలదేనని అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా మాత్రమే వాటిని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీసీకే పార్టీ నాయకులు డాక్టర్ విద్యాసాగర్, సురేష్ పంతగాని, తదితరులు పాల్గొన్నారు.



పుల్లలచెరువు మండలం వెంకట రెడ్డి పల్లెలో బీడుగా మారిన పంట పొలం

పాలకులు ఎండబెట్టి.. పొలాలు నోరెళ్లబెట్టి!

వరుణుడు కన్నెర్రజేశాడు.. అన్నదాతపై పగబట్టాడు.. ఈ ఏడాది అలకబూనాడు.. చెరువులు బీడుగా మారిపోతున్నాయి.. పంటలన్నీ ఎండిపోయాయి.. రబీ సీజన్‌లో సాగు సాగక పొలాలన్నీ బీళ్లుగా మారాయి.. కాడీ, మేడీ మూలకు చేరాయి.. పల్లెలన్నీ బోసిపోయాయి.. అన్నదాత కళ్లలో కన్నీళ్లు ఒలుకుతున్నాయి. ఇంతటి దుర్భిక్ష పరిస్థితులున్నా పట్టించుకోని పాలకుల తీరు చూసి జిల్లా రైతాంగం నోరెళ్లబెట్టింది. ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం లేక, సాగుకు చేసిన అప్పులు తీరే దారేదని రోదిస్తోంది. ఆపన్న హస్తం కోసం అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

- జిల్లాను వెంటాడిన కరువు
- 17 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు
- ఎండిన పైర్లు.. బీళ్లుగా పొలాలు
- లక్షల ఎకరాలు బీడువారిన వైనం
- రైతన్న వైపు కన్నెత్తి కూడా చూడని కూటమి ప్రభుత్వం
- వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నా రైతు కష్టాన్ని గుర్తించని పాలకులు
- సాగర్ నీటిని కూడా పూర్తిస్థాయిలో జిల్లాకు తెచ్చుకోలేని దీనస్థితిలో పాలకుల పనితీరు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో కరువు తాండవిస్తోంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ప్రకాశం జిల్లాలోనే కరువు మండలాలున్నాయి. రాష్ట్రంలో 51 మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తే.. ఒక్క ప్రకాశం జిల్లాలోనే అత్యధికంగా 17 కరువు మండలాలు ఉన్నాయంటే.. జిల్లాలో రైతుల వెతలు ఏ విధంగా ఉన్నాయో ఇట్టే అర్థమవుతోంది. అసలే వెనుకబడిన జిల్లా కావడంతో సాగర్ నీరు వచ్చినా ఎక్కువగా వర్షాధారంగా పంటలు సాగు చేస్తుంటారు. కానీ, వర్షాభావం కారణంగా జిల్లాలో ఏ రైతును కదిపినా.. పంటలు పండక, పిల్లలను చదివించలేక, కుటుంబాలను పోషించలేక, బతికేదెలా..? అని దిక్కులు చూస్తున్నారు. జిల్లాలో ఏ గ్రామంలో చూసినా ఇవే దృశ్యాలు.. రైతుల కన్నీటి గాథలు.

సాగర్ జలాలు అంతంతమాత్రమే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాకు సాగర్ జలాలు తీసుకురావడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారు. గత సంవత్సరం కృష్ణానదిలో పుష్కలంగా నీటి వనరులున్నా.. జిల్లాకు నీళ్లిచ్చే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఫలితంగా నేడు రైతు కరువు పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 47.381 టీఎంసీల నీటిని తాగు, సాగునీటి అవసరాలకు అందించినట్లు ఇరిగేషన్ అధికారులు లెక్కలు చెబుతున్నారు. జిల్లాలో 58 నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. వీటిలో సుమారు 46 చెరువులు నింపామని అధికారులు కాకిలెక్కలు చెబుతున్నారు. చాలా ప్రాంతాల్లో చెరువుల నీటి మట్టాలు పడిపోయాయి. పలు చెరువులు బీడుగా దర్శనమిస్తుండటం గమనార్హం.

మర్రిపూడిలో కరువు రక్కసి ఉగ్రరూపం...



మర్రిపూడి చెరువులో నీరు లేక పెరిగిన పిచ్చిచెట్లు

మర్రిపూడి: చుక్కనీరు లేని ఇరిగేషన్ చెరువులు, ఒట్టిపోయిన బోర్లు, 500 అడుగులు లోతుకెళ్లినా కనిపించని నీరు, కనుచూపు మేర అంతా బీడే. ఈ విధంగా మర్రిపూడి మండలంలో కరువు రక్కసి ఉగ్రరూపం దాల్చింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో మండలంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. మండలంలోని 13 ఇరిగేషన్ చెరువుల్లో చుక్కనీరు లేకపోవడంతో పిచ్చిచెట్లు పెరిగిపోయాయి. దీంతో ఆయకట్టు అంతా బీడుభూములను తలపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, నీటితడులు లేక సాగుచేసిన పంటలన్నీ నిలువునా ఎండిపోతున్నాయి. మండలంలో 500పైచిలుకు బోర్లు ఉంటే అందులో 80 చేతిపంపులు పూర్తిగా ఒట్టిపోయాయి. ఎక్కువ శాతం బోర్లు తప్పుపట్టి పనికిరాకుండా ఉన్నాయి. వ్యవసాయ బోర్లు 500 అడుగుల్లోతు వేసినా చుక్క నీరు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. దీంతో వాగులు, వంకలు, కుంటల్లో చుక్కనీరు లేక పశువులు నీటికి తీవ్ర ఇక్కట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఏప్రిల్ మొదటి వారంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే ముస్ముందు పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని మండల వాసులు వాపోతున్నారు.

- ఖరీఫ్‌లో కంది 19,086 ఎకరాల్లో సాగుచేయాల్సి ఉండగా, 21,200 ఎకరాల్లో సాగు చేశారు. అలాగే సజ్జ 842 ఎకరాలకుగానూ 766 ఎకరాలు, వాణిజ్య పంటలు 1200 ఎకరాలకుగానూ 676 ఎకరాల్లో సాగుచేశారు. వ్యవసాయ బోర్లు ఒట్టిపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. కొందరు వేలకు వేలు ఖర్చు చేసి ఆరుతడులు ఇస్తున్నారు. వర్షాలు లేకపోవడంతో తెగుళ్లు విజృంభించాయి. దీంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. మిర్చి ధరలు లేకపోవడంతో కోత కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు.



ఒట్టిపోయిన బావి

పాతాళగంగ కోసం పాట్లు



పుల్లలచెరువు : నీరు లేక ఎండిపోయిన బొప్పాయి తోట

పుల్లలచెరువు: మండలంలో తాగునీరు, వ్యవసాయ బోర్లలో నీరు పూర్తిగా అడుగంటింది. ప్రస్తుతం నీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలో వ్యవసాయం పూర్తిగా భూగర్భజలాలపైనే ఆధారపడి ఉంది. వర్షపాతం తక్కువగా ఉండటంతో గ్రామాల్లోని చిన్న, పెద్ద చెరువుల్లో నీరు పూర్తిగా అడుగంటిపోయింది. భూగర్భ జలాలు అడుగంటడంతో 1000 అడుగుల మేర బోర్లు వేస్తున్నప్పటికీ నీరు పడటం లేదు. ప్రధానంగా రైతులు మిర్చి, పత్తి, కంది, ఇతర వాణిజ్య, ఆరు తడి పంటలు సాగు చేస్తున్నారు. మిర్చి పంట సాగుచేసిన పొలాల్లో బోర్లలో నీరు రాకపోవడంతో కాపుకు వచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు విపరీతంగా నష్టపోవాల్సి వస్తోంది. పంటలు ఎండిపోతూ ఒక పక్క, వేలాది రూపాయలు ఖర్చు పెట్టి చుక్క నీరు పడక మరోపక్క రైతులు అల్లాడిపోతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పశుసంపద ఎక్కువగా ఉంది. పశువులకు తాగునీటికి ఇబ్బంది కలుగుతోంది. పశుగ్రాసం ఉన్న ప్రాంతాల్లోని చిన్నచిన్న కుంటలు, చెరువులు ఒట్టిపోయాయి. దీంతో ఇంటి దగ్గరే పశువులకు తాగునీరు అందించాల్సి ఉంది.

తగ్గిన సాగు విస్తీర్ణం...

మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 2024-25 ఖరీఫ్‌లో సాధారణ పంట విస్తీర్ణం 26,500 ఎకరాలు కాగా, 22,600 ఎకరాల్లోనే సాగేచేశారు. రబీలో 2,500 ఎకరాలు సాగుచేయాల్సి ఉండగా, కేవలం 1,530 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగుచేసినట్లు అధికారులు చెబుతున్నారు.



పుల్లలచెరువు : 1000 అడుగుల లోతు వేసినా ఒట్టిపోయిన బోరు

17 మండలాల్లో ప్రమాద ఘంటికలు...

జిల్లాలో రబీ సీజన్‌లో పంటల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. దాంతో జిల్లాలోని 38 మండలాల్లో 17 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది ప్రభుత్వం. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన ఒంగోలు రూరల్ మండలం కూడా కరువు కోరల్లో చిక్కి శల్యమవుతోంది. ఒంగోలు మండలం తీవ్ర కరువు మండలాల జాబితాలో చేరడంతో ఇక్కడ పరిస్థితి కూడా మరీ దయనీయంగా మారింది. తీవ్ర కరువు మండలాల్లో ఒంగోలుతో పాటు పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, వెలిగండ్ల, బేస్తవారిపేట మండలాలు ఉన్నాయి. సాధారణ కరువు మండలాల జాబితాలో కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, సీఎస్ పురం, పామూరు, రాచర్ల మండలాలు ఉన్నాయి.

లక్షకుపైగా ఎకరాల్లో ఎండిన పంటలు...

జిల్లాలో 2024-25 రబీ సీజన్‌లో సాధారణంగా 3,97,880 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉంది. అయితే కేవలం 2,99,331 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. వేసిన పంటల్లో కూడా దాదాపు లక్షకుపైగా ఎకరాల్లో నిలువునా ఎండిపోయాయి. మిగతా 1.99 లక్షల ఎకరాల్లో కూడా సగానికిపైగా ఎకరాల్లో దిగుబడి మరీ దారుణంగా పడిపోయింది. దాదాపు జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేయాల్సి ఉండగా, చివరకు దిగుబడి అంతంతమాత్రంగా వచ్చింది. కేవలం లక్ష ఎకరాల్లోపే అన్నది స్పష్టమవుతోంది. వేసిన పంటలు కూడా చేతికిరాక రైతులు విలవిల్లాడుతున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు...

జిల్లాలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 12 మండలాల పరిధిలోని 93 గ్రామాలు నీళ్ల లేక అల్లో రామచంద్రా అంటూ అల్లాడిపోతున్నాయి. మార్చి పూర్తవగానే ఈ పరిస్థితులుంటే.. ఇక, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో ఊహకు అందటం లేదు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లు, బావులు నిలువునా ఎండిపోయాయి. దీంతో పంటలు సాగుచేయలేక రైతులు అలమటిస్తున్నారు.

నెర్రెలిచ్చిన పొలాలు...

జిల్లాలో ప్రధాన పంటల్లో మిర్చి, కంది, మినుము, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, పెసర సాగుచేయగా, దిగుబడులు మరీ తగ్గిపోయాయి. టమోటాతో పాటు ఇతర కూరగాయల తోటలు సైతం పంటలు చేతికి రాకుండా పోయాయి.

ధర లేక మిరప పంటను వదిలేశా



ఈ ఏడాది మూడున్నర ఎకరాల్లో మిరప సాగుచేశా. ఎకరాకు రూ.1.40 లక్షల చొప్పున సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చయింది. క్వింటా రూ.9 వేల నుంచి రూ.10 వేలకు మించి అడగడం లేదు. ఈ ధరకు అమ్ముకుంటే కూలి ఖర్చులు కూడా రావు. అందుకే కాయలు కోయకుండా పొలంలోనే వదిలేశా.

– దారుకుమల్లి, పెద్దిరెడ్డి, మర్రిపూడి

చెరువుల్లో చుక్క నీరులేదు :



వర్షాలు లేక చెరువుల్లో చుక్కనీరు లేదు. దీంతో వ్యవసాయ బోర్లు అడుగంటాయి. పంటలకు పూర్తిస్థాయిలో నీరందక దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో పాటు ధరలు ఆశాజనకంగా లేవు. 10 ఎకరాల్లో కంది సాగుచేస్తే ఎకరాకు 2 నుంచి 3 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. కనీసం ఖర్చులు కూడా రాలేదు.

– బొల్లినేని నాగేశ్వరరావు, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, కొండపి

నీళ్లు లేక మిర్చి పంటను వదిలేశా :



మూడు ఎకరాల్లో మిర్చి పంట సాగుచేయగా, పంట చేతికొచ్చే సమయంలో బోర్లలో నీరు రాకపోవడంతో పంటను అలాగే ఎట్టికి వదిలేశాను. ఎకరాకు దాదాపు రూ.2 లక్షల మేర ఖర్చు రావడంతో దాదాపు రూ.6 లక్షల నష్టం వాటిల్లింది. వ్యవసాయం చేయాలంటేనే భయమేస్తోంది. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుంటే ఈ ప్రాంతంలో వ్యవసాయ రంగం అగమ్యగోచరమే.

– పి.పిచ్చయ్య, రైతు, పుల్లలచెరువు

పరిపాలనలో ప్రభుత్వాలు విఫలం

దర్శి: గ్రామీణ ప్రాంత పేదలకు మౌలిక వసతులు కల్పించడంలో, మంచి పరిపాలన అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ విమర్శించారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మౌలాలి అధ్యక్షతన ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగ ప్రజలంతా దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. పేదరిక నిర్మూలనలో వాస్తవికత లేదని, దున్నేవాడిదే భూమి అనే నినాదం అమలైతేనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు చేసిందన్నారు. పేదలకు లక్షల ఎకరాల భూములు పంచడంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కీలకపాత్ర పోషించిందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు సంవత్సరానికి 100 రోజులు పని కల్పించి వలసలు నివారించాలనే ఉద్దేశంతో పథకాలను ప్రారంభిస్తే.. పాలకులు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మాదపాకులు రమేష్‌బాబు, నాయకులు విజయ, ప్రభాకర్‌రావు, రామారావు, ఆర్.కరుణానిధి, రామాంజనేయులు, లక్ష్మి, సీహెచ్ అరుణ పాల్గొన్నారు.

సముద్రంలోకి 231 తాబేలు పిల్లలు

చినగంజాం: మండలంలోని కుంకుడుచెట్లపాలెం గ్రామంలో 231 తాబేలు పిల్లలను ఆదివారం సముద్రంలోకి వదిలారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్, ఐటీసీ బంగారు భవిష్యత్ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుంచి తాబేలు పిల్లలు తీసుకొచ్చారు.




దర్శి గాంధీనగర్ కోదండ రామాలయంలో రాములోరి కల్యాణ వేడుక



గొట్లగట్టులో పానకాల బండ్ల ఊరేగింపులో భక్తులు

చూచిన కనులదే భాగ్యము..

● వేడుకగా సీతారాముల కల్యాణం

కనివిని ఎరుగని శుభ తరుణం.. సీతారాముల కల్యాణ ఘట్టాన్ని భక్తులు కనులారా వీక్షించారు. అవనిలోనే ఆదర్శపు జంట అయిన శ్రీరామచంద్రుడు, సీతమ్మల పరిణయ వేడుకను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెళ్లి పెద్దలుగా వ్యవహరించిన ఉభయదాతలు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. చలువ పందిళ్ల కింద వేడుకగా సాగిన రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులు వడపప్పు పానకం, అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పుల్లలచెరువులో సీతారాముల కల్యాణ ఘట్టం..



బేస్తవారిపేటలో సీతారాముల కల్యాణం



బేస్తవారిపేట : వసంతోత్సవంలో గ్రామస్తుల సందడి



మార్కాపురం సాయి మందిరంలో కల్యాణం..




ఒంగోలు పోలీస్ క్వార్టర్స్‌లో కల్యాణంలో పాల్గొన్న ఎస్పీ దామోద్, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



ఒంగోలు మంగమూరు రోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల పరిణయం



సింగరాయకొండలో మహిళల కోలాటం



చీమకుర్తిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు



పామూరులో సీతారామ కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సిగ్నల్ తీగల కత్తిరింపు ఇంటిదొంగల పనేనా?

● రైల్వే పోలీసుల పాత్రపై అనుమానాలు
● రైల్వే స్టేషన్లలో అంతంతమాత్రంగా పోలీసు భద్రత
● వరుస ఘటనలతో ప్రయాణికుల్లో భయాందోళన

ఒంగోలు టౌన్: నెల్లూరు జిల్లాలో రైల్వే సిగ్నల్ తీగలను కత్తిరించి చోరీకి పాల్పడిన ఘటన మరువక ముందే ఒంగోలు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు సిగ్నల్ తీగలను కత్తిరించడం సంచలనం సృష్టిస్తోంది. శుక్రవారం ఒంగోలు జీఆర్పీ సీఐ మౌలా షరీఫ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రైలు దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అదే రోజు రాత్రి ఒంగోలు సమీపంలో కొందరు వ్యక్తులు రైల్వే సిగ్నల్ తీగలను కత్తిరించడంపై ప్రయాణికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు జాతీయ రహదారిపై జీఆర్పీ పోలీసులు పహరా కాస్తున్న సమయంలోనే మరోవైపు వారికి సమీపంలోనే దుండగులు దొంగతానికి యత్నించడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం రాత్రి 1.15 గంటల సమయంలో 282-3 పోస్టు వద్ద ఉన్న సిగ్నల్ తీగలను గుర్తు తెలియని దొంగలు కత్తిరించారు. అదే సమయంలో అటుగా హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చింది. అయితే ఆ రైలు ఇక్కడ ఆగకుండా వెళ్లిపోయింది. సిగ్నల్ తీగలను కత్తిరించిన కొద్దిసేపటి తరువాత మరో రైలు వచ్చి ఆగినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే వరస దొంగతనాలపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. రైల్వే సిగ్నల్ వ్యవస్థ మీద అవగాహన ఉన్న ప్రస్తుత ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, రైల్వే పోలీసుల సహకారం లేకుండా నిందితులు ఇలాంటి ఘటనలకు పాల్పడే అవకాశం లేదన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

అరకొర భద్రతపై ప్రయాణికుల ఆందోళన

జిల్లా కేంద్రమైన ఒంగోలు రైల్వే స్టేషన్‌లో అరకొర భద్రతపై ప్రయాణికులు ఆందోళ చెందుతున్నారు. రైల్వే స్టేషన్లో జీపీఆర్, ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్లు ఉన్నప్పటికీ తగినంత మంది సిబ్బంది లేరు. ఉన్న సిబ్బంది కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రైల్వే స్టేషన్, స్టేషన్ పరిసరాల్లో ఎక్కడ పడితే అక్కడ మందుబాబులు బహిరంగంగా మద్యం సేవిస్తున్నా రైల్వే పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టేషన్‌లోని మూడు ప్లాట్‌ఫారాలపై కనీసం ఒక్క రైల్వే పోలీసు కూడా కనిపించకపోవడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. టికెట్ లేకుండా ప్రయాణించే వారి వద్ద నుంచి డబ్బు వసూలు చేయడంపై ఉన్న ఆసక్తి రైల్వే ప్రయాణికులకు రక్షణ కల్పించే విషయంలో లేకపోవడం విమర్శలకు మరో కారణం.



సూరారెడ్డిపాలెం రైల్వే స్టేషన్

విధుల్లో నిర్లక్ష్యం

ప్రస్తుత జీఆర్పీ సీఐ మౌలా షరీఫ్ స్థానికంగా నివాసం ఉండకుండా గుంటూరు నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో జీఆర్పీ పోలీసు స్టేషన్‌పై పర్యవేక్షణ లేకుండా పోయింది. ఒంగోలు తరువాత సింగరాయకొండలో మాత్రమే ప్రత్యేక పోలీసు పాయింట్ ఉంది. ఇటీవల రైల్వే ఆధునికీకరణ పనులు జరుగుతుండడంతో ఆ పాయింట్‌ను తొలగించారు. ప్రస్తుతానికి కావలి నుంచి సింగరాయకొండకు ఆర్పీఎఫ్ పోలీసులు వస్తున్నారని తెలుస్తోంది. కావలి నుంచి ఆర్పీఎఫ్ పోలీసులు, ఒంగోలు నుంచి జీఆర్పీ పోలీసులు రోజూ ఉదయం, సాయంత్రం ఇద్దరు చొప్పున విధులకు రావాల్సి ఉంటుందని, అయితే సిబ్బంది కొరత పేరుతో ఒంగోలు నుంచి జీఆర్పీ సిబ్బంది డుమ్మా కొడుతున్నారని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ రైల్వే ఉద్యోగి పేర్కొన్నారు. కావలి నుంచి మాత్రం రాత్రి పూట మాత్రమే విధులకు హాజరవుతూ ఉదయం వేళ డుమ్మా కొడుతున్నట్లు చెప్పారు. ఒంగోలు నుంచి రోజుకు 10 వేల మందికి పైగా ప్రయాణికులు, సింగరాయకొండ నుంచి రోజూ 4 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సరైన రక్షణ లేకపోవడంతో రైళ్లలో ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వృత్తిపై ఆర్టీసీ కంట్రోలర్ నిబద్ధత



ప్రయాణికుడికి బ్యాగు అందిస్తున్న కంట్రోలర్ బాబు

ఇంకొల్లు(చినగంజాం): ఓ ప్రయాణికుడు బస్సులో మరిచిపోయిన బ్యాగును ఇంకొల్లు ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్ సురక్షితంగా అప్పగించి వృత్తిపై నిబద్ధత చాటుకున్నారు. వివరాలు.. గిద్దలూరు ప్రాంతంలో పంచాయతీ గుమస్తాగా విధులు నిర్వహించే జితేంద్రరెడ్డి ఆదివారం తన వ్యక్తిగత పనిపై ఒంగోలు నుంచి ఇంకొల్లుకు ఆర్టీసీ బస్సులో వచ్చారు. ఈ క్రమంలో బస్సులో తన బ్యాగు మరచిపోయారు. బ్యాగు పోగొట్టుకున్న విషయాన్ని ఆలస్యంగా గుర్తించి ఇంకొల్లు బస్టాండ్‌లోని కంట్రోలర్ షేక్ బాబును సంప్రదించారు. అయితే అప్పటికే ఆయన ప్రయాణించిన బస్సు ఒంగోలుకు బయలుదేరింది. బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేసిన కంట్రోలర్.. బ్యాగును తిరిగి తెప్పించి జితేంద్రరెడ్డికి అప్పగించారు. బాధితుడితోపాటు ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహన కృష్ణ తదితరులు కంట్రోలర్‌ను అభినందించారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటా..



కేక్ కట్ చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

● జన్మదిన వేడుకల్లో కార్యకర్తలనుద్దేశించి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. 2029 ఎన్నికల్లో జిల్లాలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడుతుందని పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో బూచేపల్లి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ అనంతరం పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా సన్మానించారు. పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవి బాబు అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, మాజీ ఎఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కార్పొరేటర్లు, ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుంపా చెంచిరెడ్డి, దామరాజు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నరకం.. ఉద్యోగం చేయలేం!

● ముండ్లమూరు ఎంపీడీఓ తీరుపై ఉద్యోగుల గగ్గోలు

ముండ్లమూరు(దర్శి): మండల పరిషత్ ఉన్నతాధికారి తన కార్యాలయ ఉద్యోగులతోపాటు సిబ్బందితో వ్యవహరిస్తున్న తీరు రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. టీడీపీ ఇన్‌చార్జి అండతోనే ఇన్‌చార్జి ఎంపీడీఓ వ్యవహార శైలిలో మార్పు వచ్చిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మొదలైన వేధింపులు తారాస్థాయికి చేరాయని, విధి నిర్వహణలో నరకం చూపెడుతున్నారని ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ముండ్లమూరు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కల్పన అనారోగ్య కారణాలతో మార్చి 31వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. సెలవులు ముగిశాక కార్యాలయానికి వచ్చిన సీనియర్ అసిస్టెంట్‌ను ఎంపీడీఓ విధుల్లో చేర్చుకోలేదు. టీడీపీ ఇన్‌చార్జి చెబితేనే జాయిన్ చేసుకుంటానని సీనియర్ అసిస్టెంట్‌కు ఎంపీడీఓ తెగేసి చెప్పడం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశమైంది. జాయినింగ్ విషయమై రెండు పర్యాయాలు టీడీపీ ఇన్‌చార్జిని కలిసిన సీనియర్ అసిస్టెంట్‌కు నేటికీ ఎదురుచూపులే దిక్కయ్యాయి. ‘నేను చెబుతా.. మీరెళ్లండి’ అని టీడీపీ ఇన్‌చార్జి హామీ ఇచ్చినా ఎంపీడీఓ తనను విధుల్లో చేర్చుకోవడం లేదంటూ తోటి ఉద్యోగుల ఎదుట వాపోతున్న తీరు చర్చనీయాంశమైంది. లాంగ్ లీవ్‌పై వెళ్లిపోవాలని సీనియర్ అసిస్టెంట్‌పై ఎంపీడీఓ ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఎంపీడీఓ కార్యాలయంలో టైపిస్టును కూడా లాంగ్ లీవ్ పెట్టుకోవాలని, డ్యూటీకి రావడం లేదని మెమో ఇస్తానని బెదిరించడంతో మరో నెల సెలవు పెట్టుకున్నట్లు సమాచారం. అలాగే మరో మహిళా ఉద్యోగిని కూడా ఇన్‌చార్జి ఎంపీడీఓ వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం.

చేతివాటం చూపేందుకే..?

సీనియర్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లిన సందర్భంలో ఆమె స్థానంలో జూనియర్ అసిస్టెంట్ మురళిని ఇన్‌చార్జిగా నియమించారు. సెలవు నుంచి తిరిగొచ్చిన సీనియర్ అసిస్టెంట్‌ను విధుల్లో చేర్చుకోకుండా జూనియర్ అసిస్టెంట్‌ను అలాగే కొనసాగించేందుకు ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రయత్నిస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్‌చార్జి సీనియర్ అసిస్టెంట్‌తో కలిసి బిల్లుల చెల్లింపుల్లో చేతివాటం చూపేందుకే ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మొండిగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా జూనియర్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జి సీనియర్ అసిస్టెంట్‌గా నియమించే అధికారం ఇన్‌చార్జి ఎంపీడీఓకు లేదని ఉద్యోగులు చెబుతున్నారు.

మహిళా పోలీసుపై ఆగని వేధింపులు

మహిళా పోలీస్ కట్టా అనూష రోజూ విధులకు హాజరవుతున్నా మూడు నెలలుగా వేతనం చెల్లించకుండా ఇన్‌చార్జి ఎంపీడీఓ అడ్డు తగులుతున్నారు. వేతనం విషయమై పంచాయతీ కార్యదర్శిని సంప్రదిస్తే ‘ఎంపీడీఓ వద్దన్నారు, ఆయన చెబితే శాలరీ బిల్ పెడతా’ అని చెప్పడంతో ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. నేను గర్భిణిని. విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నా మానసిక వేధింపులకు గురి చేస్తున్నారు’ అని అనూష వాపోయింది.

భయ భయంగా విధులు

ఎంపీడీఓ విధుల్లో చేరినప్పటి నుంచి నరకం చవిచూస్తున్నామని, వేధింపుల విషయం బయటకు చెబితే టీడీపీ ఇన్‌చార్జికి చెప్పి ఇంకా ఎన్ని ఇబ్బందులు పెడుతారోనని మహిళా ఉద్యోగులు లోలోన కుమిలి పోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎంపీడీఓ వ్యవహార శైలిపై విచరణ చేపట్టాలని మహిళా ఉద్యోగులు కోరుతున్నారు. ఉద్యోగుల ఆరోపణలపై ఎంపీడీఓను వివరణ కోరగా.. ‘వాళ్లు పనిచేయడం లేదనే జాయిన్ చేసుకోలేదు. టైపిస్టు అందరి దగ్గర డబ్బులు తీసుకుంటున్నారని జాయిన్ చేసుకోలేదు. నా ఇబ్బందులు నాకు ఉన్నాయి’ అని చెప్పారు.